# ఆతిథ్యము

[కథానిక]

✲

= శ్రీ జనమంచి రామకృష్ణ =

నేను సైనికదళంలో హవిల్దారుగా పనిచేశాను. యుద్ధం ముమ్మరంగా జరుగుతూన్న దినాలవి. వాయవ్య సరిహద్దురాష్ట్రానికి నన్ను బదిలీ చేశారు. మా సిబ్బందిలో వివిధ ప్రాంతాలకి చెందిన వాళ్లుంతా వున్నారు. శిబిరం దాటి వెలుపలికి వెళ్లేందుకు మా దళాధిపతి కొంతమంది పఠానుల కాపలా నిచ్చి మరీ పంపేవాడు. ఆ సందర్భంలోనే ఫతేఖాన్ నాకాప్త మిత్రుడయాడు. కారణం: బహుశా మా ఆదర్శాల ఐక్యతే అనుకుంటాను.

ఒకనాడు మేమంతా షికారుగా ఒక కొండగూడెం ప్రాంతంలోకి వెళ్ళేరాము. నడుస్తూన్న ఫతేఖాన్ హఠాత్తుగా ఆగి, "భాయీ! ఆ ప్రదేశం జ్ఞాపకం పెట్టుకోండి. మీకో మంచి కథ చెప్తాను తర్వాత" అన్నాడు.

"మీ దేశమంతా కథలదేశంలా గుందే! ప్రతి చిన్న ప్రదేశాన్నిగురించీ ఏదో ఒక కథ ఉందన్నమాట! బాగుంది భాయీసాబ్!" అని నేను నవ్వగానే "మా జాతిని ఇంతవరకూ ఈ బ్రిటిషువారు అర్థం చేసుకోలేదు. ప్రభుత్వంవారి అభిప్రాయ మేమంటే, సరిహద్దురాష్ట్రప్రజలు అనాగరికులనీ, మానవమాత్రులు కారనీ, వారికి హృదయం లేదనీని. వారి నాగరకత కొలబద్దతో మా నాగరికతని కొలుస్తారు—పర్యవసానం విమానదాడులూ, గుళ్లవర్షాలూను. భాయీ! మా పఠానులున్నారే—వారు స్వాతంత్ర్యప్రియులు. ఆ స్వేచ్ఛకోసం అనుమానంగాకూడా ప్రవర్తించడానికి వెనుతీయరు. తర్వాత మా జాతి సన్న హృదయం మరెవ్వరిలోనూ గోచరించదు మాఆదర్శాలు విపరీతంగా ఉంటాయి. ఇంక మా ఆతిథ్యం అంటారా—మానవజాతి అంతా మా దగ్గిర నేర్చుకోవాలి!... అన్నట్లు, ఆ ప్రదేశాన్నిగురించిన కథ ఆతిథ్యాన్నిగురించే!"

మేమంతా మా శిబిరాలు చేరుకున్నాము. నా గుడారంలో నేనూ, ఫతేఖానూ కూర్చున్నాము. చీకటిని చీలుస్తూ అప్పుడప్పుడు కొండగుహలలోంచి తుపాకీగుళ్లు మెరుస్తున్నాయి-మిణుగురుపురుగుల్లా.

"ఫహారా హుషార్! ఫహారా హుషార్!"

ఫహారాలో ఉన్న సిపాయిలు కేకలు వేస్తూ గస్తీ తిరుగుతున్నారు. ఫతేఖాన్ హుక్కా పీలుస్తూ వెర్రిగా నవ్వి, "భాయ్! మనవాళ్ల కీవేళరాత్రి కునుకు పట్టదు. చూశారా తుపాకీ లెలా పేలుతున్నాయో!......భాయీసాబ్! రండి, మా ఆతిథ్యం గురించి చెప్తాను వినండి!

"ఆ కొండగూడేనికి ఒక నాయకు డుండేవాడు—అజ్జాంఖాన్. అతనంటే బ్రిటిషువారికి పక్కలోని బల్లెం, సింహస్వప్నం. అతణ్ణి లొంగతీసుకుందుకు నయాన్నీ భయాన్నీ ప్రయత్నించారుకాని లాభం లేకపోయింది......అజ్జాంఖా నింట్లోనే నేను చెప్పబోయే కథ జరిగింది.

"భాయీ! సరిగ్గా పదేళ్లక్రితం నాటి గాథ. ఆ గూడెంలోని యువకు లందరూ అజ్జాంఖాన్ కొడుకు అమానుల్లా నాయకత్వంక్రింద ఉంటూ బ్రిటిషువారి చర్యలకు ప్రతీకారం చేస్తుండేవారు.

"అమానుల్లా ఆజానుబాహు; అందగాడు; చురుకైనవాడు. ఆ వేళ పానశాలవద్ద యువకు లందరూ సమావేశమయారు. పొరుగు గూడెంనుండి వచ్చే అట్టాఖాన్ రాకకోసం ఎదురుచూస్తున్నారు.

"అట్టాఖాన్ తుర్కీ రక్తం కలవాడు. అతనూ మంచి ఆజానుబాహుడే కాని నల్లగా, మోటుగా, భయంకరంగా ఉంటాడు. అట్టాఖాన్ అమానుల్లా గూడెంలోని కన్యను అల్కాను ప్రేమించాడు. గాఢంగా ప్రేమించాడు. ఆమెకూడా మరులుకొంది. కాని అమానుల్లాకీ విషయం సరిపడలేదు. పొరుగుగూడెం యువకు డెవడో తన గూడెంలోని యువతిని తన సమ్మతిగాని, ప్రమేయంగాని లేకుండా ప్రేమించడం అతని కిష్టం లేకపోయింది. బహుశా అమానుల్లాకూడా అల్కాను ప్రేమించియుండవచ్చును. ఏమైనా ఆ ప్రణయానికి స్వస్తి చెప్పాలని తలచి అమానుల్లా తన బృందంతో అట్టాఖాన్‌కోసం ఆ పానశాలవద్ద వేచి ఉన్నాడు.

"అట్టాఖాన్ కొండదిగడం యువకబృందం చూసింది. అట్టాఖాన్ కూడా చాలామంది యువకులు తనవైపే దృక్కులను కేంద్రీకరించి చూడడం గ్రహించాడు. ఐనా లెక్కచేయక తిన్నగా గూడెంలోకి వచ్చాడు. రావడంతోనే, యువకులందరూ అతని చుట్టూ వలయాకారంగా మూగారు. అమానుల్లా ముందుకు వచ్చి అట్టాఖాన్ ఎదురుగా ఛాతీ విరుచుకుంటూ నిలబడి, వంగి సలాంచేసి, 'దోస్త్! మాతో పానశాలలోకి రావలసిందని ఆహ్వానిస్తున్నా' అన్నాడు.

"'నీ ఆహ్వానం నిరాకరిస్తున్నా!' అన్నాడు అట్టాఖాన్ కొంచెం కోపంగా.

"'మా ఆతిథ్యాన్ని అంత అమర్యాదగా నిరాకరించవద్దని కోరుతున్నాను. ఆతిథ్యాన్ని మానవుడైనవా డెవ్వడూ నిరాకరించడు!'

"అట్టాఖాన్ ఆతిథ్యాన్ని త్రోసిరాజనలేక అమానుల్లాతో పానశాల ప్రవేశించాడు. యువకబృందం కూడా తమ నాయకు ననుసరించారు. ఒక పానపాత్ర అట్టాఖాను కిచ్చి, తా నొకటి తీసుకు త్రాగుతూ—

"'దోస్త్! నాకూ, నా మిత్రులకూ నీవు అల్కాను ప్రేమించడం ఇష్టంలేదు. ఈ ప్రణయవ్యవహారానికి ఇంతటినుంచి స్వస్తిచెప్తే చాలా మంచిది' అన్నాడు అమానుల్లా.

"'అలాగా! ఐనా, ఆ వ్యవహారం నాకు సంబంధించినది, మీకు ప్రమేయం లేనిది.'

"'వీల్లేదు! ఈ విషయంలో మాకు సంబంధం వుం!' అని కోపంగా రెట్టించాడు అమానుల్లా.

"అట్టాఖాన్ పకిలిగా నవ్వి—'భాయీ! నీ ఆతిథ్యానికీ, నీ సలహాకూ చాలా కృతజ్ఞుణ్ణి! త్రాగడం ఐందికాబట్టి, నాకు సెల విప్పించు. తిన్నగా అల్కా ఇంటికి వెడతాను.'

"'అట్టాఖాన్! ఈ పానశాల వదిలి తిన్నగా మీ వూరికి పోయే దారి పట్టు...లేకపోతే...'

"'దోస్త్! శాంతంలో నా కంత నమ్మకం లేదు. అన్యాయంగా అల్కాను ప్రేమిస్తున్న సంగతి ఎవరికి తెలుసును? ఐనా చూద్దాంలే!'

"ఏమీ మాట్లాడకుండా అందరూ ఒక్కక్షణం సేపు ఆలోచనలో పడ్డారు. ఇంతలోనే అట్టాఖాన్ అమానుల్లాకు సిగరెట్టు కాల్చుమని అందిచ్చాడు. అమానుల్లా ఎంతో మర్యాదతో సలాంచేసి, సిగరెట్టు తీసుకొన్నాడు. అట్టాఖాన్‌కు ఆ నిశ్శబ్దత విసుగు కల్గించింది. ఒరలోంచి కత్తి తీసి బల్లమీద ఏవో బొమ్మలు గీయడం సాగించాడు. తిరిగి హఠాత్తుగా కత్తిని యథాస్థానంలో ఉంచి, లేచినిలబడి, 'దోస్తాం! ఏం పనిలేకుండా ఇక్కడ ఊరికే మూగగా కూర్చోవడం ఏమీ బాగులేదు. నేను వెడుతున్నాను.'

"'జానానా! ఇలా కూర్చోవడం బాగాలేదు. లెండి బైటికి పోదాం' అని అమానుల్లా అనగానే యువకు లందరూ కూడా లేచి పానశాల బైటికి వచ్చేశారు.

"'దోస్తాం! మరి సెలవా?'

"'వాలేకుం సలాం దోస్త్.. దోస్తాం! అట్టాఖాన్ తిరిగి తన గ్రామం వెళ్లిపోతున్నాడు...దారి ఇవ్వండి!' అన్నాడు అమానుల్లా.

"'నేను మా వూరు వెళ్లడం లేదు. నా పనిమీద నేను ఊళ్లోకి వెడుతున్నా!'

"'మంచిది! సరే. ఐతే, మేమూ నీవెనకనే నడిచి వస్తాము!' అంటూ అమానుల్లా బృందం అట్టాతో కలిసి నడిచారు. అల్కా వుండే వీధివైపు మళ్లుతూన్న అట్టా ఖాన్ జబ్బలు పట్టుకుని 'ఇటు! ఇటు!' అని ఇద్దరు యువకులు కొండవైపు లాగారు. తక్కినవారు అర్ధ చంద్రాకారంలో అట్టాఖాన్ చుట్టూ మూగగానే అమానుల్లా ముందుకు వచ్చి 'దోస్త్! వాళ్ల బాహుబంధంనుంచి తప్పించుకుందుకు ప్రయత్నించకు, లాభంలేదు... దోస్త్! మేము చూపుతూన్న అమర్యాదకు మన్నించు. కాని, ఇదంతా నీ మంచికోసమే చేస్తున్నాము. నలుగురూ ఈ విషయంగురించి తెలుసుకోడం మా కిష్టం లేదు. అందుచేత, ఆ మసీదు వెనకాతలకి రా. అక్కడ మాట్లాడుకుందాము. ...'

"అట్టాఖాన్ క్రోధపూరితుడై పళ్లు పట పట కొరికినాడు. ఏమీ మాట్లాడకుండా ఆ ఇద్దరు యువకులతోనూ మసీదువెనుక కెళ్లాడు.

"'ఇప్పటికైనా ఈ పెంకితనం చాలించి ఇంటికి వెళ్లిపోతావా లేదా? మేమంతా కలిసి నిన్నేమి చేయబోతామో నీ కర్థమైందనుకుంటాను. నా మాట విని ఇంటికి వెళ్లిపో!...వెడతావా వెళ్లవా?' అని గర్జించాడు అమానుల్లా.

"అట్టాఖాన్ సమాధానం చెప్పలేదు.

"'వెడతావా వెళ్లవా?'

"'నేనిలా వెడతాను'. అని శరవేగంతో అట్టాఖాన్ యువకులను ప్రక్కకి త్రోసివేసి ముందుకు నడిచాడు. కాని, అమానుల్లా మెరుపులా ముందుకురికి, అట్టాఖానుని మసీదుగోడకు వేసినొక్కి ఆపాడు. అట్టాఖాను మండిపడిపోయి ఒరలోంచి కత్తి తీశాడు.

"'వద్దు! వద్దు! అంతపని చేయవద్దు!' అంటూ అమానుల్లా అట్టాఖాన్ చెయ్యి పట్టుకున్నాడు. లోన ప్రవహిస్తున్న తుర్కీ రక్తం అట్టాఖాన్‌ని పిచ్చెత్తించింది. ఒక్క వూపుతో అమానుల్లాని విసిరికొట్టి గుండెల్లో పొడిచాడు. అమానుల్లా నేలమీద కొరిగాడు. అట్టాఖాన్ మెరుపులా పారిపోయాడు. సగంమంది యువకులు అతని వెంట తరుముతూ పరుగెత్తారు. మిగతా సగం మంది యువకులూ ఉపచారం చేస్తూ అమానుల్లా వద్ద ఉండిపోయారు.

"తరుముకుంటూ లేడికుక్కల్లా వెనక వస్తున్న యువకుల్ని చూసి అట్టాఖాన్ భయపడిపోయాడు. పరుగెత్తలేకపోయాడు. ఏ కొంపలోనైనా దూరి ప్రాణం రక్షించుకుందామని ప్రయత్నించాడు. అలసిపోయాడు. దూరాన ఒక ఇల్లు కనిపించింది. లోపలికి పరుగెత్తాడు; ముసలి వానిని చూశాడు లోపల. పరుగెత్తుకుంటూ వస్తూన్న యువకుణ్ణిచూసి, 'ఏం నాయనా' అని ముసలివాడడగగానే, అట్టాఖాన్ అతని కాళ్ల మీద పడి, 'నన్ను రక్షించండి!' అని వేడుకున్నాడు.

"'నీ కే అపాయం రాదు. నేనున్నాగా! నీ కేం భయంలేదు!'

"'నేను పొడిచాను! ...అతణ్ణి...నేను...పొడిచాను! మీ ఊళ్లోని ఒక యువకుణ్ణి నేను అన్యాయంగా పొడిచాను...ఐనా వాడు నా శత్రువు—వాళ్లంతా నన్ను చంపడానికి తరుముకుంటూ వస్తున్నారు...నన్ను రక్షించరూ?'

"'తప్పకుండా? ...అబ్బాయీ! నవ్వు నా అతిథివి' అన్నాడు ముసలివాడు.

"'అంతలోనే అట్టాఖాన్‌ని తరుముకుంటూ వచ్చిన యువకులు ముసలివాని ప్రాంగణంలో చెమటలు కక్కుకుంటూ నిలబడ్డారు. ఒక యువకుడు ముసలివానితో—

"'హజరత్! మాలో ఒకణ్ణి వాడుపొడిచినాడు!,

"'తెలుసు! అతనే చెప్పాడు;...ఐతే, ఇతణ్ణి ఏమి చేయతలిచారు మీ రంతా?'

"'ఆ సంగతి మాకు వదిలిపెట్టెయ్యండి! అతణ్ణి మాత్రం మాకు అప్పచెప్పండంతే!'

"'లాభంలేదు. మీరు ఇంతకు ముందే రావలసింది. ఇప్పుడతను నా అతిథి. మీ కతణ్ణి అప్పగించలేను సరి గదా, అతని ఒంటిమీద మీలో ఎవరైనా చెయ్యి వేసినా ఒప్పను.'

"నోటంట మాట లేకుండా నిశ్చేష్టులై యువకులంతా అక్కడే నిలబడిపోయారు. మళ్లా యువకుల్లోంచి మరో ప్రశ్న:

"'హజరత్! అన్యాయంగా ఒక మనిషిని పొడిస్తే ఆ హంతకుణ్ణి శిక్షించద్దా?'

"'శిక్షించ వచ్చును. కాని, ఆ పొడవబడినవాడు నా అతిథి శత్రువట. శత్రుత్వంలో పొడిస్తే నేరం కాదు'

"'కాని ఒక గంటక్రితం వారిద్దరూ శత్రువులు కారు. ఏదో కోపంలో చంపితే అది న్యాయమా?'

"ముసలి వాడు అట్టాఖాన్ వైపు చూసి భుజా లెగరేసి—

"'ఏమో! అతను నా అతిథి' అన్నాడు.

"'అతను, మీ...' వాక్యం పూర్తిచెయ్యలేక పోయాడు యువకుడు.

"'చెప్పేయ్! అసలుసంగతి ఆయనకుచెప్పేసేయ్ ...అక్రంఖాన్ పొలంలో ఉండి ఉంటాడు-అతణ్ణి పిల్చుకురండి. అతనే చెప్తాడు...ఎవరు చచ్చిపోయారో!' అన్నాడు మరొక యువకుడు.

"అక్రంఖాన్ కోసం ఇద్దరు యువకులు పొలంలోకి పరుగెత్తారు. కోపంతో, దుఃఖంతో అక్రం పరుగెత్తుకుంటూ వచ్చాడు. ముందుకు నడిచి—

"'అబ్బాజాన్!'అని ముసలివానిని పిల్చాడు.

"'అబ్బాజాన్! మీ కొడుకునే చంపినట్లైతే,ఆ మనిషికి రక్షణఇస్తూ అతిథిగానే గౌరవిస్తారా?'

"ముసలివాడు-అజ్జాంఖాన్ తనకొడుకు- అక్రంఖాన్ కళ్లల్లోకి తేరిపారచూశాడు. యథార్థం గ్రహించాడు.

"'అమానుల్లా!' అని తండ్రి దీర్ఘమైన నిట్టూర్పు విడిచినాడు. 'అమానుల్లా గాయపడ్డాడా?'

"'వాళ్లంతా కలిసి తమ్ముణ్ణి మసీదులోకి తీసి కెళ్లారు! ఇంటికి వస్తూ, తమ్ముణ్ణి చూశాను...చచ్చిపోయాడు!'

"'ఇతనేనా వాణ్ణి చంపుత!'

"'ఔను! అతనే! ఇక్కణ్ణించి తరిమివేయండా నరహంతకుణ్ణి! అబ్బాజాన్!..... అబ్బాజాన్! అమానుల్లాని ఇంటికి తీసుకురావాలి! వాణ్ణి ఇక్కణ్ణించి గెంటేయండి!'

"అజ్జాంఖాన్ అమానుల్లా తండ్రనీ, తాను శరణుజొచ్చినది తాను చంపినవాని గృహమేననీ తెలియగానే అట్టాఖాన్ తెల్లబోయి నిశ్చేష్టుడయాడు.

"అజ్జాం ఒక్కసారి వెనక్కి తిరిగి అట్టాఖాన్ కేసి చూశాడు. అట్టాలోని దీనత్వాన్ని గ్రహించాడు.

"'అమానుల్లా! అమానుల్లా!' అని అట్టాఖాన్ కంట తడిపెట్టడం 'అక్కడున్నవారంతా చూశారు. 'అమానుల్లా చనిపోయాడా! చనిపోయాడా!'

"అక్రంఖాన్ కేసి తిరిగి అజ్జాంఖాన్—'బేటా! అమాన్ దగ్గర కెళ్లు! ఈ మనిషిని నేను తరిమివేయలేను...ఇతను నా అతిథి!'

"'ఇప్పుడు కాకపోతే ఇంక కొంచెం సేపటికైనా బైటికిరాడా! మేము వదులుతా మనుకున్నారా?' అని యువకులందరూ కోపోద్రిక్తులై కేక లేశారు.

"'నా రక్షణక్రింద ఈ వూరు విడిచివెడతాడు! అంతకన్నా నే నేం చేయుగలను చెప్పండి'! లోని బాధను పుక్కిటబట్టి అన్నాడు అజ్జాంఖాన్.

"అక్రంఖాన్ అమానుల్లాదగ్గిర కెళ్లి పోయాడు. యువకబృందంకూడా అజ్జాంగృహ ప్రాంగణంనుండి తొలగిపోయి, బైట,దారిలో అట్టాఖాన్ కోసం ఎదురు చూస్తున్నారు. వీథితలుపు వేసి, లోపలికి వెళ్లి, ఒక కుర్చీలో కూలబడి అజ్జాంఖాన్ దీర్ఘంగా ఆలోచించ సాగించాడు. అజ్జాం, అట్టాఖానులు ఒకరితో నొకరు మాట్లాడుకోలేదు. పుత్రశోకంలో ఉన్న ముసలివానిని ఓదారుద్దామని అట్టా ప్రయత్నించాడు గాని, ఎలా ఓదార్చాలో తెలిసిందికాదు. చివరకు అట్టాఖాన్ ఇలా అన్నాడు:

"'హజరత్! అతణ్ణి చంపాలని అసలు అనుకోలేదు. అనవసరంగా దెబ్బలాడుకున్నాము......నేను ఉండబట్టలేక పోయాను......'

"సర్వం తెలిసినట్లుగా తల ఊపి, మాట్లాడకుండా ఊరుకున్నాడు అజ్జాంఖాన్.

"సాయంత్రం పడింది. తన అతిథినిగురించి ఆలోచిస్తున్న అజ్జాం ఒక నిశ్చయానికొచ్చి, వంట మనిషి మోతీని పిల్చి, అట్టాకు భోజనం పెట్టమన్నాడు.

"'చూడు! అబ్బాయ్! భోజనం చేయకుండా మాత్రం వెళ్లవద్దు......ఆకుర్చీబల్లదగ్గరగా లాక్కొని భోజనం చెయ్యి..... కొద్దిగా, నీతోపాటు నేనూ భోజనం చేస్తాలే...నేను తక్కువ తింటూన్నందుకు నీ వేమీ అనుకోకు !......నాకు...నాకు...అంతగా ఆకలి లేదు !'

"'నాకూ ఆకలిలేదు హాజరత్ !'

"'అర్రే! అలా అంటే ఎలాగ? అంతో ఇంతో భోజనం చేసి తీరాలి! చూడు! నీవు చాలా దూరం నడిచివెళ్లాల్సివుంది...పోనీ నేనూ మామూలుగా భోజనం చేసేందుకు ప్రయత్నిస్తాలే!' అంటూ అజ్జాంఖాన్ భోజనంచేయడం ప్రారంభించాడు.

"'అబ్బాయి! అలా భోజనం చేయకుండావుంటే యెలాగ? పోనీ కొంచెం సారా త్రాగు! అందులోనూ, కష్టంలో ఉండి, మనస్సు చికాకుగా ఉన్నప్పుడు మనిషి త్రాగితే ఏ బాధా కనిపించదు!'

"తన అతిథి కెక్కడ అమర్యాదగా తోస్తుందోనని అజ్జాంఖాన్ మాట్లాడడం మొదలెట్టాడు.

"ఈ లోయలో పండే గోధుమలు చాలా బాగుంటాయికదూ?'

"'ఔనట! మా అబ్బాజాన్ అంటూంటారు!'

"'ఈయేడు ఏమిటో తమాషా, వేసవిలో బాగా వర్షాలు పడ్డాయి. లోయప్రాంతంలోనే కాదు, చివరకు మా పొలాలలో కూడా వర్షపాతం ముమ్మరంగానే వుంది. నేల పచ్చబడ్డంచేత గొర్రెలూ, మేకలూ బాగా మేసి బలిశాయి.'

"'చాలా సంతోషం'

"'అబ్బాయి! భోజనం చేయడానికి భిడియపడుతున్నట్లున్నావు!......సరే లే! తినగల్గినంతే తిను. తతిమ్మాది మూటకట్టి ఇస్తాను, దారిలో, ఆకలేస్తే తిందువుగాని.'

"తర్వాత అజ్జాంఖాన్ అట్టాఖాన్‌కు హుక్కా, పాన్‌సుపారీ ఇచ్చాడు. కొంచెం విశ్రాంతి తీసుకున్న తర్వాత అజ్జాం, 'అబ్బాయి! ప్రయాణానికి తగినంత శక్తి చేకూరిందనుకుంటాను!......మరి లేద్దామా?'

"'చిత్తం! మీకు నా కృతజ్ఞత!'

"'లే మరి!'

"'నేను సిద్ధమే!'

"పిస్తోలు పట్టుకుని అజ్జాం ముందు నడుస్తూంటే, అట్టాఖాన్ అతని వెనుక నడిచాడు. వీధిలోకి రాగానే, అట్టారాక కెదురుచూస్తున్న యువకులు అజ్జాం కళ్లబడ్డారు వారికేసి చేయి ఊపుతూ, 'వెనక్కు తగ్గండి! ఇతను నా అతిథి. నా రక్షణ క్రింద ఉన్నాడు!' అని కేకవేశాడు. యువకులు వృద్ధుని మనస్సు గ్రహించి, వెనక్కు తగ్గారు. అట్టాఖాన్‌ని వెనక వేసుకొని కొండల చాయలలోకి రాగానే అజ్జాంఖాన్, 'అట్టాఖాన్! త్వరగా, చీకటిపడకముందె మీ వూరు చేరుకో! ఇంక రెండు ఘంటల వ్యవధే వుంది. తర్వాత మన వూళ్ల రెంటికీ రక్తపాతమయే యుద్ధం జరుగుతుంది. వెళ్లిపో!' అన్నాడు.

"అట్లా ఉంటాయి భాయీ మా మర్యాదలు!" అని ఫతేఖాన్ నవ్వాడు. ఇంతలోకే కొండలోయలో జ్వాలాతోరణం కన్పించగానే గుడారంలో కలకలం పుట్టినది. మేమంతా సాయుధులమై ముందుకు పురోగమించాము.

---